PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 86 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 24 మార్చి 2026

## పోరాట యోధుడు భగత్ సింగ్


3లో

## ప్రజావాణిలో గృహలక్ష్మి లబ్ధిదారుల వినతి



5లో

# హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

- మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం
- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసనమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ. 15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ. 24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు మిగతా2లో...



## 5 రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నాం

### - ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్ మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తీవ్రమవుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, మౌలిక వసతులపై 5 రోజుల పాటు దాడులు నిలిపివేయాలని తాను ఆదేశాలు జారీచేసినట్టు తన ట్రూత్ మిగతా2లో...



## 53 లక్షల మెట్రిక్ టన్నుల స్ట్రాటజిక్ రిజర్వ్ పెట్రోల్ ఉంది: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితిపై ఇవాళ ప్రధాని మోదీ లోక్‌సభలో మాట్లాడారు. దౌత్యం, చర్చల ద్వారానే సమస్యను మిగతా2లో...

## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

### అభినందనలు తెలుపుతు ఎక్స్‌లో పవన్ పోస్ట్


2లో

## తమిళనాడు బిజెపి సీట్ల షేరింగ్

### - 27 స్థానాల్లో బీజేపీ పోటీ


2లో

## బియ్యం ఎగుమతలపై అసెంబ్లీలో మాటల యుద్ధం

- అక్రమాలు జరిగాయన్న హరీష్ రావు
- హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,23 (పిసిడబ్ల్యూ న్యూస్):** బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని మిగతా2లో...

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


2లో

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఉద్యోగుల భద్రతకు, వారి కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కట్టుబడి మిగతా2లో...



## మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం

### - క్యూనెట్ సంస్థ వ్యవహారాలపై సిపి సజ్జన్నార్

**హైదరాబాద్,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సోమవారం క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టాగంట్ అని చెప్పుకొచ్చారు. మిగతా2లో...

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

- రైతుబంధును 15 వేలు అని,12వేలకు కుదింపు
- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?
- బడ్జెట్‌పై చర్చలె బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ. 12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ‘ మొదటి బ్జడెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ. 15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బ్జడెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపో వడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బ్జడెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు మిగతా2లో...

# హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు.

ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ. 15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి.

సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే దిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.

## 53 లక్షల మెట్రిక్ టన్నుల స్ట్రాటజిక్ రిజర్వ్ పెట్రోల్ ఉంది: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించుకోవాలన్నారు. దౌత్యపరమైన అంశంలో భారత్ స్పష్టంగా ఉందని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ ప్రయత్నిస్తోందన్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్న నేపథ్యంలో పశ్చిమాసియా పరిస్థితులు ఆందోళనకరంగా మారిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో చమురు సమస్యలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తన ప్రసంగంలో పలు అంశాలను ప్రస్తావించారు. ఈ యుద్ధం నుంచి ఉద్భవించే పరిస్థితులు చాన్నాళ్లు ప్రభావం చూపనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ పరిస్థితులను ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని కొందరు అడ్వాంటేజ్ తీసుకునే అవకాశాలు ఉన్నాయని, అందుకే శాంతి భద్రతలను సరైన రీతిలో మానిటర్ చేయాలన్నారు.సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని అన్నారు. గత దశాబ్దం కాలం నుంచి ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రియార్టీ ఇచ్చామని, దీనిలో భాగంగా ముడి చమురును స్టోరేజీని పెంచామన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల స్ట్రాటజిక్ రిజర్వ్ పెట్రోల్ ఉందని ప్రధాని వెల్లడించారు. దీంట్లో ఎంబీబీఎస్ చదువుతున్న 700 మంది విద్యార్థులు ఉన్నారు. పశ్చిమాసియా ప్రభావాన్ని తగ్గించేందుకు స్వల్ప కాలిక, మధ్యశ్రేణి, దీర్ఘకాలిక వ్యూహాలను అను సరిస్తున్నట్లు చెప్పారు.యుద్ధం జరుగుతున్న పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం పట్ల భారత పార్లమెంట్ ఒకే స్వరాన్ని వినిపించాలన్నారు. ఆ సంక్షోభం మొదలై మూడు వారాలు దాటిందని, ప్రతి ఒక్కరికీ అది ప్రభావం చూపుతోందని, యుద్ధం జరుగుతున్న దేశాలతో భారత్‌కు కీలకమైన వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు ఆయన చెప్పారు. భారత్ వద్ద 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోలియం రిజర్వ్‌లు ఉన్నాయని, ఇథనాల్ బ్లెండింగ్ వల్ల .. గతంతో పోలిస్తే భారత్ సుమారు 4.5 కోట్ల బ్యారళ్ల ఇంధనాన్ని తక్కువ దిగుమతి చేసుకుంటోందని ప్రధాని తెలిపారు.

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బ్జడెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బ్జడెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. బ్జడెట్‌పై చర్చలో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గింటిందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. తొలి బ్జడెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దాన్ని రూ.12 వేలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ..

రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు బ్జడెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బ్జడెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌ల లో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని చెప్పారు.జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బ్జడెట్‌లో చెప్పారని, ఈసారి బ్జడెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాది కల్లా రూ.12 వేల కోట్లు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని రూ.46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని, ఊరూరుకు బార్లు ఓపెన్ చేస్తారా..? అని నిలదీశారు. దాంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో రూ.12 వేల కోట్లుగా ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు పెంచిందని అన్నారు. జూపల్లి కలుగజేసుకోవడంపై హరీష్‌రావు అసహనం వ్యక్తంచేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కగారు సమాధానం చెప్పాలని అన్నారు. తాను బ్జడెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన స్జబెక్టుపై కాదని చెప్పారు. తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును విమర్శించారు.

## మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ.5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించు కొన్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టా÷-గ్గ్÷ట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్ ్÷నాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు. నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 32 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నారని ప్రస్తావించారు. చాలామంది ఇండియన్ డైరెక్ట్ సె÷-లలెర్స్‌గా ఏర్పడి బిజినెస్ చేస్తున్నారని అన్నారు. డైరెక్ట్ ప్రోడక్ట్ సెల్లింగ్ పేరుతో మనీ స్కాంలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## బియ్యం ఎగుమతలపై అసెంబ్లీలో మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. 'బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. ఫిలిఫ్ఫైన్ తో కు బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఫిలిప్పిన్స్ తో ఒప్పందం కోసం గార్గ్ ను అడ్వైజర్ గా పెట్టుకున్నారని.. గార్గ్ అనే వ్యక్తి ఈడీ ,సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నాడని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో 7 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యం .. ఏడాదిగా ముక్కిపోయాయని విమర్శించారు. బియ్యం ఎగుమతితో సివిల్ సప్లైస్ శాఖకు కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు.

## 5 రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నాం..

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రెండ్రోజులుగా వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య చర్చలు జరుగుతున్నాయని, చర్చలు సజావుగా, నిర్మాణాత్మకంగా ఉన్నాయని చెప్పారు. ఇరాన్ – అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారంలోకి చేరుకోగా, తొలిసారి ట్రంప్ ప్రకటనతో ఉద్రిక్తతలు తగ్గేందుకు అవకాశాలున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి.దీనికి ముందు, చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం ఇచ్చారు. లేదంటే ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఆ గడువు ముగుస్తుండటంతో ట్రంప్ తాజాగా ఐదు రోజుల పాటు దాడులకు బ్రేక్ వేస్తున్నట్టు ప్రకటించారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతాయని, వాటి ఫలితంపై ఆధారపడి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కాగా, ఏవైనా షరతులకు అంగీకరించడం కానీ లాంఛనంగా చర్చలు ప్రారంభం కావడంపై కానీ ఇంకా టెహ్రాన్ స్పందించలేదు.

## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

**అమరావతి,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రధాని మోడీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8,931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోడీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం మోడీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కల్యాణ్.. 'గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు' అని పవన్ కల్యాణ్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, త్యాగం, అపార కృషితో కొనసాగుతున్న నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. మౌలిక వసతులు, పేదల సాధికారత, డిజిటల్ మార్పులు వంటి రంగాల్లో ప్రధాని మోడీ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ పాత్ర కీలకమని పేర్కొన్నారు పవన్ కల్యాణ్? ఈ మైలురాయి నిజమైన నాయకత్వం స్థిరత్వం, నిబద్ధత, స్వార్థరహిత సేవపై ఆధారపడుతుందని గుర్తుచేస్తుందని అన్నారు. ఇక, ప్రధాని మోడీకి మరింత ఆరోగ్యం, శక్తి కలగాలని, దేశసేవలో ఇంకా ఎన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు..

## తమిళనాడు బిజెపి సీట్ల షేరింగ్


**చెన్నై,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలను నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ సోమవారం పూర్తి చేసింది. ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి, బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో సీట్ల పంపకాలు ఖరారయ్యాయి. చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీజేపీ తమిళనాడు విభాగం చీఫ్ నయనార్ నాగేంద్రన్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకర్ కూడా పాల్గొన్నారు. సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు 27 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనుంది. 2021లో బీజేపీకి కేటాయించిన సీట్ల కంటే 7 సీట్లు ఎక్కువగా ఈసారి కేటాయించారు. పీఎంకేకు 18, ఏఎంఎంకేకు 11 సీట్లు కేటాయించారు. అన్నాడీఎంకేకు సింహభాగం సీట్లు లభించాయి. 170కి పైగా సీట్లలో అన్నాడీఎంకే పోటీ చేయనుంది.సీట్ల పంపకాలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, తామంతా ఒక కుటుంబమని, కలిసికట్టుగా విజయం కోసం పోరాతామని చెప్పారు. 27 సీట్లతో తాము సంతృప్తిగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర సంస్కృతిని స్టాలిన్, ఉదయనిధి అవమానించారని, ప్రజలు కూడా విసుగెత్తిపోయారని, ఈ ఎన్నికలను తాము స్వీప్ చేస్తామని చెప్పారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఉందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్, సింగరేణి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రమాద బీమా పథకం కింద భారీ మొత్తాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఓర్సు సురేశ్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఉద్యోగి. ముక్తార్ బేగ్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉద్యోగి. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు



**హైదరాబాద్,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని,బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు.మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించి 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకే పదవీ విరమణ వయసు పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

## కల్లూరులో రన్ ఫర్ జీసస్ పోస్టర్ ఆవిష్కరణ

# విశ్వాస సందేశంతో ర్యాలీకి పిలుపు

**ఏప్రిల్ 4న "రన్ ఫర్ జీసస్" భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చిన రెవరెండ్ ఏనోష్ కుమార్**

**యేసుక్రీస్తు సిలువ, పునరుత్థానం సందేశం కోసం రన్ ఫర్ జీసస్ కల్లూరులో**





**కల్లూరు, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల ఐక్య క్రైస్తవ సమైక్య, అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ ఏనోష్ కుమార్ సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కల్లూరులోని టిజిఎం వర్షిప్ సెంటర్‌లో మండల అధ్యక్షులు తేళ్ల ఎబినేజర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన క్రైస్తవ నాయకులు సమావేశమై రన్ ఫర్ జీసస్ కార్యక్రమం విజయవంతానికి చర్చలు జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్ ఏనోష్ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం యేసుక్రీస్తు సిలువ వేయబడిన త్యాగం, మరణం మరియు పునరుత్థానం సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటడం అని తెలిపారు. సమాజంలో ప్రేమ, శాంతి, సేవా భావం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 4వ తేదీన నిర్వహించనున్న ఈ ర్యాలీ కల్లూరు ఎన్ఎస్పి క్రాస్ రోడ్ నుండి నూతన బస్టాండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఈ ర్యాలీలో క్రైస్తవులు మాత్రమే కాకుండా అన్ని మతాల ప్రజలు పాల్గొని ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. విశ్వాసం, సోదరభావం, సమైక్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా సెల్ అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, నియోజకవర్గ అధ్యక్షులు పి.డి దాసు, కన్వీనర్ కెనడి రాజు, గౌరవ సలహాదారు టి. సంజీవరావు, కల్లూరు మండల అధ్యక్షులు తేళ్ల ఎబినేజర్, పెనుబల్లి మండల అధ్యక్షులు కోట దేవదానం, వేంసూర్ మండల అధ్యక్షులు మోదుగు ఓనేసిమ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్, వైస్ ప్రెసిడెంట్ సుందర్ రాజు, జాన్ పరంజ్యోతి, ప్రధాన కార్యదర్శి రాయల తిమోతి, కోశాధికారి జీవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కట్టా మహేష్, యెహోషువతో పాటు పలువురు దైవ సేవకులు హాజరయ్యారు. కార్యక్రమం విజయ వంతం కావాలంటే ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నాయకులు సూచించారు. రన్ ఫర్ జీసస్ ద్వారా యేసుక్రీస్తు బోధనలు ప్రజలకు చేరవేయడమే కాకుండా సమాజంలో సానుకూల మార్పులకు దారితీయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. మొత్తంగా, కల్లూరులో జరగనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం విశ్వాసం, సమైక్యత మరియు సేవా భావానికి ప్రతీకగా నిలవనుందని స్థానిక క్రైస్తవ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**● ప్రజా సేవలో మెరుగైన పనితీరు కనబరచాలి: ఎంపీడీవో డి చంద్రశేఖర్**






**కల్లూరు, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో ఆయా గ్రామపంచాయతీలలో నూతనంగా ఎన్నిక చేయబడిన వార్డు సభ్యుల సామర్థ్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం రైతు వేదిక లో ఏర్పాటు చేసిన వార్డు సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని వార్డు సభ్యులకు సూచించారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, పంచాయతీరాజ్ వ్యవస్థలో వారికి ఉన్న బాధ్యతలను సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వార్డు సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ శిక్షణ కార్యక్రమం రెండు విడతలుగా నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రతి విడత ఐదు రోజుల పాటు కొనసాగుతుందని, ఇందులో గ్రామ పాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పారదర్శకత, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై అవగాహన కల్పించబడుతుందని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా వార్డు సభ్యులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలతో ఇల్లు... మైనర్ పేరుతో పాజెషన్!

**● ములుగులో రిజిస్ట్రేషన్ బ్యాంకు లోన్ మోసం**

**మల్లంపల్లి మండల ప్రతినిధి మార్చి 23 (పిసి డబ్ల్యూ న్యూస్):** ములుగు పట్టణంలోని ఇంటి నం. 2-134 వ్యవహారం నకిలీ పత్రాలు, తప్పుడు రికార్డులు, బ్యాంకు లోన్ మోసం ఆరోపణలతో పెద్ద వివాదంగా మారింది. బయటపడుతున్న వివరాలు అధికార వ్యవస్థ పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ఇంటి రికార్డులు ఒకరి పేర్లపై ఉండగా, యాజమాన్యం మరొకరి పేరుతో నమోదు కావడం గంభీరమైన విరుద్ధతగా మారింది. ఒకే ఆస్తికి మూడు పేర్లు చుట్టుముట్టడం వెనుక అసలు కథ ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ అంశంపై ఫిర్యాదు అందుకున్న అధికారులు విచారణకు ఆదేశించగా, మున్సిపల్ కమిషనర్ స్థాయిలో జరిగిన పరిశీలనలో ధృవీకరణ పత్రం నకిలీ అని తేలడం సంచలనం రేపింది. కానీ ఇంత పెద్ద విషయం బయటపడిన తర్వాత కూడా తదుపరి చర్యలు లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇక అసలు ట్విస్ట్ ఏమిటంటేడ అదే ఆస్తిపై గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ జరగడం, ఆ పత్రాల ఆధారంగా బ్యాంకు నుంచి సుమారు 15 లక్షల హౌస్ లోన్ పొందినట్లు ఆరోపణలు రావడం. బ్యాంకు రికార్డుల్లో 2008 నుంచే పాజెషన్ ఉన్నట్లు చూపించడం మరింత అనుమానాలకు తావిస్తోంది. అయితే, 2008లో సంబంధిత వ్యక్తి మైనర్‌గా ఉండటం ఈ కేసుకు కీలక మలుపు. 10వ తరగతి చదువుతున్న సమయంలోనే ఆస్తిపై పాజెషన్ చూపించడం ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా అసలు వివాహమే కానీ అమ్మాయి పేరు మీదగా అత్తగారి ఇంటి పేరు మారడంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఇది పూర్తిగా అవాస్తవం చట్టానికి విరుద్ధంగా నకిలీ పత్రాలతో చట్టాన్ని అవహేళనగా చేస్తూ తయారుచేసిన ధ్రువపత్రాలతో గుండెబోయిన శ్రీ కల పేరు పై మార్పిడి చేసినట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది. అసలు విషయమే ఏమిటంటే 2008లో పదవ తరగతి చదువుతున్నది. ఆ సమయంలో వివాహం జరగలేదు. 2012 లో వివాహం జరిగితే 2008 అని ,ఆ సమయంలోనే పాజెషన్ లో ఉన్నట్లు చిత్రీకరించారు. అలాగే మరొక విషయం ఏమిటంటే 2006 సంవత్సరంలోనే గుండేబోయిన సరోజన అనారోగ్యంతో మృతి చెందారు. కానీ 2008 సంవత్సరంలో మృతి చెందిన వ్యక్తి బ్రతికి వచ్చి, వివాహం జరగని గుండబోయిన శ్రీ కల పేరు మీద మ్యూటేషన్ చేసినట్టుగా ఫోర్జరీ సంతకాలతో దొంగ డాక్యుమెంట్లను తయారు చేయడం చర్చనీ అంశంగా మారుతుంది. ఇది పత్రాల అసలుదనం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై పెద్ద ఎత్తున సందేహాలు రేకెత్తిస్తోంది. ఇంతకీ నకిలీ పత్రం ఎవరు జారీ చేశారు? రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది? బ్యాంకు లోన్ ఎలా మంజూరైంది? అనే ప్రశ్నలకు సమాధానాలు మాత్రం ఇంకా దొరకడం లేదు. పైగా, ఈ వ్యవహారంపై అడిగిన RTI ప్రశ్నలకు "రికార్డులు లేవు" అని సమాధానం రావడం అధికారుల వైఖరిపై మరింత అనుమానాలు పెంచుతోంది. మొత్తం మీద ఈ కేసు నకిలీ పత్రాలు, రికార్డు మార్పులు, ఆర్థిక మోసం, అధికారుల నిర్లక్ష్యం పెద్ద ఎత్తున అక్రమాల బింబంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



# మూలగూడెం గ్రామ అభివృద్ధికి జర్పులా రవీందర్ నాయక్ కృషి ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన





**రఘునాధపాలెం, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం మూలగూడెం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా జర్పులా రవీందర్ నాయక్ నిరంతరం కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించిన ఆయన, స్వంత ఖర్చులతో బోర్ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించారు. అదేవిధంగా గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయడం, డ్రైనేజ్ శుభ్రత పనులు చేపట్టడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిస్తున్నారు. ఈ చర్యలతో గ్రామ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా జర్పులా రవీందర్ నాయక్ మాట్లాడుతూ, మాజీ మంత్రి అజయ్ గారి ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మూలగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు మరింత కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సెక్రటరీ సౌజన్య, ఉప సర్పంచ్ కోలేం సుజాతతో పాటు దేవీసింగ్, పుల్లయ్య, మంగీలాల్, వీరారెడ్డి, తావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొని తమ సహకారం అందించారు.

# చలో అసెంబ్లీకి బయలుదేరిన బీజేపీ మండల అధ్యక్షుడు బాయ్ కాని మహేందర్ అరెస్ట్... ములుగులో ఉద్రిక్తత



**మల్లంపల్లి మండల ప్రతినిధి మార్చి 23 (పిసిడబ్ల్యూన్యూస్):** ములుగు జిల్లా, మల్లంపల్లిభారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు యన్. రామ్ చందర్ రావు గారి పిలుపు మేరకు నిర్వహించనున్న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీజేపీ మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మల్లంపల్లి మండలం నుండి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని ములుగు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు ముందస్తు చర్యలలో భాగంగా ఈ అరెస్ట్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఈ ఘటనతో మల్లంపల్లి మండలంలో బీజేపీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుండగా, పోలీసులు ముందస్తు జాగ్రత్తగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# పోరాట యోధుడు భగత్ సింగ్

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండు సురేష్.**

**- విప్లవ చైతన్యానికి మారుపేరు భగత్ సింగ్**

**- నవతరానికి స్ఫూర్తిదాత**

**- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ**

**- మరణాన్ని సైతం ముద్దాడిన విప్లవ వీర కిశోరాలు**

**- భగత్ సింగ్ రాజ్ గురు సుగుదేవ్‌ల 95వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన**







**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశభక్తికి నిలువెత్తు రూపం, పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం, త్యాగానికే, దేశభక్తికి అసలైన నిర్వచనం చెప్పిన వీర కిశోరాలు అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్, రాజు గురు, సుకుదేవుల 95వ వర్ధంతి సందర్భంగా పాత సిపిఐ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ గిరి ప్రసాద్ విగ్రహం వరకు భారీ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతనను జరిగిన సభని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. భరతమాత వీరపుత్రులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, లు. ఉరితాడుతో ఉయ్యాల ఊగిన భారతదేశ విప్లవ వీరులు పేరు లేకుండా భారత స్వతంత్ర పోరాట చరిత్ర లేదు అన్నారు. ధైర్యానికి ప్రతీక భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవుల భారతదేశ స్వతంత్ర పోరాటానికి వారి అమరత్వం స్ఫూర్తినిచ్చింది. విద్యార్థి దశ నుండే భారతదేశ స్వతంత్ర ఉద్యమానికి స్వాతంత్ర్య జ్వాలలను తన మనసు నిండా నింపుకొని స్వాతంత్రం ఉద్యమం వైపు ఆకర్షితులై భారత దేశ స్వతంత్ర సంగ్రామం వైపు అడుగులు వేశారు. స్వాతంత్ర పోరాటం ఉవ్వేత్తిన ఎగసి పడుతున్న తరుణంలో 1929 నా పార్లమెంట్ పై బాటకేశ్వర దత్ తో పొగ బాంబులు వేసి కరపత్రాలు యదజల్లి విప్లవం వర్ధిల్లాలని నినాదాలు ఇచ్చాడు. ఇంక్విలాబ్ జిందాబాద్.. నినాదం యొక్క స్ఫూర్తి కోట్లాదిమంది భారతీయుల గుండెల్లో సజీవంగా ఉంది. భయం ఎరగని భారతీయుడు. భగత్ సింగ్ కు భారతరత్న ఇవ్వాలి. ఆయన చరిత్రను పాఠ్యాంశాలో చేర్చాలి. మార్క్సిజం వైపు భగత్ సింగ్ ఆలోచనలు అతని సహచరులు భారత కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై భారత కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల ఊరిని ఆపి ఉంటే దేశంలో ఉన్న యువత విద్యార్థుల్లో భగత్ సింగ్ స్వాతంత్ర జ్వాలలను మరింత రగిలించేవాడు. భగత్ సింగ్ బలిదానం ద్వారా అమరవీరుడిగా భగత్ సింగ్ గుర్తింపు పొందాడు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ... భగత్ సింగ్ మరణం తర్వాత దేశంలో విప్లవ ఉద్యమాలు మరింత బలపడ్డాయి. భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో విప్లవ భావజాలం కలిగిన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ ఏర్పాటుకు దోహదపడ్డాయి. సార్వభౌమ అధికారం లౌకికవాదం, సోషలిజం సెక్యులరిజం కమ్యూనిజం కోసం పోరాడుతున్న ఎందరికో గొప్ప స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్ నేటి తరానికి స్ఫూర్తిదాత చరిత్ర వీరుల్ని విప్లవదీరులని పట్టిస్తుంది అలాంటి పోరాట యోధుడిని భగత్ సింగ్ భారతమాత దాస్య శృంకాలను తెంచేందుకు ఉరితాడుని పూలమాలలుగా వేసుకొన్న ధైర్యశాలి ఆదర్శానికి నిలువెత్తు నిదర్శనం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లను ఆదర్శంగా తీసుకొని నేటి యువత విద్యార్థులు విద్యా కాషాయకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, మతోన్మాదానికి చేసిన వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగుల మీర, ఆకాష్ పవన్, జిల్లా నాయకులు గోపి, గోపి, సాయి, సరస్వతి, మౌనిక, భద్రమ్మ, లావణ్య, మానస, నవ్య, సంధ్యా, రాజేశ్వరి, ఉష, సుజాత, శైలు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యతో నిత్యం అవస్థలు

**● అనునిత్యం వాహనదారుల ఇబ్బందులు**



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** పుంగునూరు పట్టణంలో అనునిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం మధ్యాహ్నం దాదాపు 40 నిమిషాల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సోమవారం పట్టణంలో వారపు సంత సందర్భంగా ఒక్కసారిగా వాహనాలు రద్దీ అధికమవడంతో వాహనదారులు ట్రాఫిక్ లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలో రోడ్లు విశాలంగా లేకపోవడం, రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడం, ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కలో వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో క్రమేపి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నదని పలువురు వాపోయారు. ముఖ్యంగా పట్టణంలో గోకుల్ సర్కిల్, బస్టాండ్, ముడెప్ప సర్కిల్ తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నదని, పోలీసులు వ తగు చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యకు పెట్టాలని చెక్ పెట్టాలని పలువురు కోరారు.

# కరీంనగర్ ఆదర్శ నగర్‌లో ఘనంగా ఈద్ మిలాప్...






**కరీంనగర్ టౌన్ మార్చి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణం ఆదర్శనగర్ లో బిజెపి మైనార్టీ మోర్చా నాయకులు మొహమ్మద్ బషీరుద్దీన్, మొహమ్మద్ అజారుద్దీన్ ల ఆధ్వర్యంలో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తూ, సామరస్యానికి ఈద్ మిలాప్ ఈ ప్రోగ్రాం ద్వారా సందేశాన్ని అందించింది. హిందూ ,ముస్లిం సమాజాలకు చెందిన అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సోదరభావం సామరస్యాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని ప్రముఖులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. హిందూ, ముస్లిం సమాజాలకు చెందిన అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సోదరభావం మరియు సామరస్యాన్ని ప్రతిబింబించారు. ఈ సమావేశంలో శాంతి, ఐక్యత మరియు పరస్పర గౌరవం వంటి విలువలను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు హాజరైన అతిథులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. నగర ప్రముఖులు, కార్పొరేటర్లను శాలువాలతో సన్మానించారు. ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మహమ్మద్ బషిరోద్దీన్, మహమ్మద్ అజారుద్దీన్ లు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలతో బిజెపి-ఎమ్మెల్యే గంగుల బంధం బయటపడింది

**పూల పాన్పులో పెట్టి బిజెపికి మేయర్ గిఫ్ట్ ఇచ్చిన గంగుల**

**కోట్లాది రూపాయలు దండుకొని బిజెపి ఎదుగుదలకు ఎమ్మెల్యే పరోక్ష సహకారం**

**66డివిజన్లలో పోటీచేసిన కాంగ్రెస్ 14, బిఆర్ఎస్ 9సీట్లకే ఎలా పరిమితం అయ్యాయి**

**గెలిచిన, ఓడిన ఎంఐఎం నిత్యం ప్రజాసేవలో తరిస్తుంది**

**ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ వ్యాఖ్యలు**




**కరీంనగర్ టౌన్ మార్చి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బిజెపికి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు ఉన్న ఫెవికాల్ బంధం బయటపడిందని, రాజకీయ ప్రయోజనాల కోసమే బిజెపికి చెందిన మంత్రితో, లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని, డిలిమిటేషన్ లో డివిజన్లను, బిజెపికి అనుకూలంగా చేయించి, మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్లో పూల పాన్పులో పెట్టి బిజెపికి మేయర్ గిఫ్ట్ ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కే దక్కుతుందని, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఎద్దేవా చేశారు. సోమవారం నగరంలోని ఎంఐఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు మెజార్టీ బిఆర్ఎస్ కార్పొరేటర్లను బిజెపి లోకి పథకం ప్రకారం పంపించి, ఫలితాలు వచ్చాక కోట్లాది రూపాయలను, రేకుర్తి ప్రాంతంలోని ఒక ఫంక్షన్ హాల్ వేదికగా, బిజెపి వద్ద దండుకొని కరీంనగర్ సిటీలో బిజెపి ఎదుగుదలకు, ఎమ్మెల్యే గంగుల పరోక్షంగా సహకారాన్ని అందించారని ఆరోపించారు. 66 డివిజన్ల లో పోటీ చేసిన కాంగ్రెస్ 14స్థానాల్లో, 44మంది కార్పొరేటర్లతో ఉండి, 66స్థానాల్లో పోటీ చేసిన బిఆర్ఎస్ కేవలం 9స్థానాలతో సింగిల్ డిజిట్ కు ఎలా పరితమైందని ప్రశ్నించారు. ఇవన్నీ ముస్లిం సమాజం గమనించాలని కోరారు. ప్రజా తీర్పును శిరసావహించి గెలిచిన, ఓడిన ఎంఐఎం నిత్యం ప్రజల్లో ఉండి, సమస్యల సాధన కోసం అలుపెరుగకుండా పోరాటం చేస్తుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడమే లక్ష్యంగా తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించినట్లు తెలిపారు. నగరంలోని కొన్ని డివిజన్లలో పార్టీ బలహీనంగా ఉన్న చోట డివిజన్ కమిటీలను హైకమాండ్ ఆదేశాల మేరకు మార్పులు చేర్పులు చేస్తామన్నారు. 6సంవత్సరాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పార్టీని, అందరి సహకారంతో బలోపేతం చేశామన్నారు. కరీంనగర్ లో దారుస్సలామ్ ఏర్పాటు చేసి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలో జరుగబోయే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. తమ విజ్ఞప్తి మేరకు పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం డివిజన్లలో ఏర్పాట్లు చేసి, ఈద్గాలలో సైతం సకల ఏర్పాట్లు చేసిన, కాంగ్రెస్ ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్కు, మున్సిపల్ కమిషనర్ కు, పోలీసు కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, జాయింట్ సెక్రటరీ హాఫిజ్ యూసుఫ్, ఆతిన, ఇబ్రహీం, కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్, నాయకులు అజర్ దబీర్, బాబుజానీ, వాజిద్ అలీఖాన్, తాజుద్దీన్,సాజిద్‌సురేశ్,సుధాకర్,సలీంలు పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు



**కల్లూరు, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో ఉన్న రైతు వేదికలో సోమవారం ఆత్మ , వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. రైతుల ఆదాయాన్ని పెంచడం మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేయడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు వరి పంటకు అనుకూలమైన మెరుగైన రకాల ప్రోత్సాహంపై వివరించారు. అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలను ఎంచుకోవడం, సరైన సాగు పద్ధతులను పాటించడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని సూచించారు. అలాగే హెచ్‌టి పత్తి సాగు వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ, భూమి నాణ్యతపై పడే ప్రతికూల ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఇక నానో ఎరువుల వినియోగం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పంటల దిగుబడిని పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. సహజ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించి, రసాయనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దకోరుకొండి సర్పంచ్ నాగమణి, భాస్కర్, శరత్ బాబు, మండల వ్యవసాయ అధికారి రూప, ఏఈఓ లు, రైతులు పాల్గొన్నారు.

# పేద మహిళకు కౌన్సిలర్ల కరుణా హస్తం

**మనసున్న మనుషుల సేవకు ప్రజల ప్రశంసలు**

**4 వ వార్డ్ కౌన్సిలర్ భూక్య రాంబాయి**

**16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు**



**కల్లూరు, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని నిరూపిస్తూ కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు చూపిన సేవా భావం ప్రజల హృదయాలను కదిలించింది. డబుల్ బెడ్ రూమ్ నివాసి షేక్ సాహిన్ అనే పేద మహిళకు అవసర సమయంలో అండగా నిలిచి, 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు 4 వ వార్డ్ కౌన్సిలర్ భూక్య రాంబాయి శ్రీనివాస్ తమ దయార్ద హృదయాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే, షేక్ సాహిన్ ఇటీవల కల్లూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆసుపత్రి ఫీజులు చెల్లించే స్తోమత లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే కల్లూరు మున్సిపాలిటీ 4వ వార్డ్ కౌన్సిలర్ భూక్యా రాంబాయి శ్రీనివాస్ మరియు 16వ వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు స్పందించి, తమ వంతుగా కొంత నగదు ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయం అందుకున్న సాహిన్ కౌన్సిలర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి పేదలకు అండగా నిలిచినందుకు వారి సేవా భావాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ, సమాజంలో పేదలు, నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నప్పుడు ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత తలా కొంత సహాయం చేయాలని పిలుపునిచ్చారు. మనుషుల మధ్య సహకారం, పరస్పర సహాయం ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కౌన్సిలర్ల మానవతా సేవకు స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ కమిటీ అధ్యక్షులు ముత్తమాల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ నంది అవార్డుతో సత్కరించబడిన ఉషోదయ సంస్థ అధ్యక్షురాలు నీరుకొండ ఉషారాణి




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మొగిలి అండ్ ఎన్ఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక స్వర్ణ నంది ఉగాది పురస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను సత్కరించి స్వర్ణ నంది అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న ఉషోదయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు నీరుకొండ ఉషారాణి కి ఖమ్మం నగరంలో ఎన్ఎస్పి రామగిరి ఫంక్షన్ హాల్లో ప్రతిష్టాత్మకమైన స్వర్ణ నంది పురస్కారం అందజేశారు. సమాజంలోని పేదలు, మహిళలు, అవసరమైన వర్గాల అభ్యున్నతికి ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. సమాజ సేవ పట్ల ఆమె చూపుతున్న అంకితభావం, నిరంతర సేవా తపన, ప్రజల సమస్యల పరిష్కారంలో తీసుకుంటున్న చొరవ ఈ సత్కారంతో మరింత వెలుగులోకి వచ్చింది. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆమె సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా నీరుకొండ ఉషారాణి గారికి పలువురు ప్రముఖులు, సేవా సంస్థలు, అభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# అక్రమ అరెస్టులు సరికాదు

**- ప్రజా గొంతుకలను అణచలేరు**

**- బీజేపీ జిల్లా నాయకులు రుద్ర ప్రదీప్**



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అక్రమ అరెస్టులు సరికాదని, ప్రజా గొంతుకలను అణచివేయలేరని బీజేపీ జిల్లా నాయకులు రుద్ర ప్రదీప్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీజేపీ నాయకులు రుద్ర ప్రదీప్ మండిపడ్డారు. బీజేపీ నాయకులు రుద్ర ప్రదీప్, మారుతి వీరభద్ర ప్రసాద్, పిల్లలమర్రి వెంకట్, దీకొండ శ్యాంసుందర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రుద్ర ప్రదీప్ మాట్లాడుతూ... ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి అమలులో పూర్తిగా చేతులెత్తేసిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయిందని అన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల్లో ఆశలు రేకెత్తించి, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా కాలయాపన చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయడం ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి పౌరుడికి ఉన్న హక్కు అని, అలాంటి హక్కును పోలీసు బలగాల ద్వారా అణచివేయాలని ప్రయత్నించడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని రుద్ర ప్రదీప్ విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను దాచిపెట్టాలని చూస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీజేపీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, ప్రజలకు న్యాయం జరిగే వరకు వెనుకడుగు వేయబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి, మడమ తిప్పి, ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేసిందని ఈ ప్రజావ్యతిరేక పాలనకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దూరంలో లేవని హెచ్చరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి ప్రజాభిమానం మరింత పెరుగుతుందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రుద్ర ప్రదీప్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, అక్రమ అరెస్టులు, బెదిరింపులు, నిర్బంధాలతో బీజేపీ శ్రేణుల పోరాటస్ఫూర్తిని ఏమాత్రం దెబ్బతీయలేరని ఆయన స్పష్టం చేశారు.

# స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయం

**నడికూడ,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తమతో పాటు కలిసి చదువుకున్న తోటి మిత్రునికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని వరికోల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి 2012 వ సంవత్సరం బ్యాచ్ కి చెందిన దొగ్గెల సునీల్ తల్లి కోమల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సునీల్ తో కలిసి చదువుకున్న స్నేహితులు తమ మిత్రుడికి ఆర్థిక సహాయం అందించారు. సాయం చేసిన వారిలో ఓరుగంటి సంపత్, రామంచ విష్ణు, తవిటి సురేష్, చింతల రజనీకాంత్, పకిడే శివాజీ, చింతల రాజు, గోల్కొండ ప్రగత్ లు ఉన్నారు.



# ఆకతాయిల ఆగడాలు..

**• సమస్యల వలయంలో టిడ్కో గృహాల నివాసులు**



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణంలోని టిడ్కో గృహాలలో నివసించే ప్రజలు ఆకతాయిల ఆగడాలతో ఇబ్బందులకు గ్రౌతున్నామనని పుంగనూరు అర్బన్ సీఐ సుబ్బరాయుడు కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ టిడ్కో గృహాలులో నివసించే తమకు కొందరు ఆకతాయిల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు తెలిపారు. కొంతమంది ఆకతాయిలు ఈ ప్రాంతంలో ప్రతినిత్యం గంజాయి సేవిస్తున్నారని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఈ ప్రాంతం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ ప్రాంతాలలో డ్రైనేజీ సమస్య, నీటి సమస్య, కరెంటు సమస్య తీవ్రంగా ఉందని వారు తెలిపారు. ఇదే అంశంపై మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డికి వినతి పత్రం అందజేశామన్నారు. దాదాపు 1500 కు పైగా గృహాలను నిర్మించగా గతంలో 600 కు పైగా కుటుంబీకులు నివసించే వారిని, ప్రస్తుతం కేవలం 300 కుటుంబాలు మాత్రమే టిడ్కో గృహాల్లో నివసిస్తున్నారని వారు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిలయంగా మారడంతో క్రమేపి ప్రజలు తమ నివాసాలను మారుస్తున్నారని తెలిపారు. పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కల్లూరు, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో నారయ్య బంజర ఫీడర్ పరిధిలో మరమ్మత్తు పనులు నిర్వహించబడనున్న నేపథ్యంలో, నేడు మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుందనీ ఈ మేరకు సంబంధిత విద్యుత్ శాఖ ఏ ఈ ఆసిఫ్ తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం విద్యుత్ అంతరాయం కారణంగా నారయ్య బంజర, ముచ్చారం, యజ్ఞనారాయణపురం, ఓబులారావు బంజర, విశ్వనాథపురం, సత్యనారాయణపురం, పాయపూర్, రంగం బంజార, మల్సూర్ తండా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందనీ అన్నారు. ఫీడర్ పరిధిలో నిర్వహించబడే ఈ మరమ్మత్తు పనులు విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.విద్యుత్ సరఫరా నిలిచే సమయంలో గృహ అవసరాలు, వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలగవచ్చునని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యుత్‌పై ఆధారపడే చిన్న వ్యాపారులు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కావున పై గ్రామాల ప్రజలు ఈ అసౌకర్యాన్ని సహనంతో స్వీకరించి, మరమ్మత్తు పనులకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. పనులు పూర్తయ్యిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని వారు తెలిపారు.

# అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదు...

**• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి.**





**తిమ్మాపూర్,మార్చి23పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకోసం పోరాడే బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తే భయపడేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. అమలుగాని 420 హామీలు, 6 గ్యారంటీల ను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావ్ చలో అసెంబ్లీ కి పిలుపునిచ్చిన క్రమంలో సోమవారం ఉదయమే తిమ్మాపూర్ బీజేపీ నాయకులను, కార్యకర్తలను ఎల్ఎండి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేసినంత మాత్రాన ప్రజల కోసం ఎంతటికైనా సిద్ధమేనని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,మాజీ ఎంపీటీసి ఎడ్ల జోగిరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల.తిరుపతి రెడ్డి,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధికారప్రతినిధి రాజు గౌడ్,జంగ సునీల్ రెడ్డి, వేల్పుల ఓదయ్య, రేగూరి సుగుణాకర్,దూల్గుంటి శేఖర్ రెడ్డి,కిన్నెర ముత్తిలింగం,యాదగిరి తదితరులను ఎల్ఎండి ఇంచార్జి ఎస్ఐ అన్వర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ తిలక్ ముందస్తుగా అదుపులోకి తీసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

# సాయిబాబా సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లకు ఘన సన్మానం...

**కరీంనగర్,మార్చి23(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని సాయిబాబా సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో సోమవారం రోజున 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ , 62 వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపెల్లి శ్రీలేఖ జితేందర్, డివిజన్ కార్పొరేటర్ దేశ శిల్ప వేదం లను ఘనంగా సన్మానించారు.సాయిబాబా సేవా సత్సంగ్ బాధ్యులు మాట్లాడుతూ సన్మాన గ్రహీత కార్పొరేటర్ లకు డివిజన్ సమస్యల పట్ల అవగాహన ఉందని, వారి ఆధ్వర్యంలో డివిజన్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు, నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు చూడాలన్నారు. ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కార్పొరేటర్లు తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు ఆకారపు భాస్కర్ రెడ్డి, అన్నాది అజిత్ రావు, రాజేందర్ రావు, సదానందం, ఉప్పుల అంజనీ ప్రసాద్, జక్కుల ప్రకాష్, నరోత్తం రెడ్డి, గాడగొని రమేష్ గౌడ్, బండారి శ్రీనివాస్, కొంగల రాజిరెడ్డి, నర్సింహా రెడ్డి, గాయత్రి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



# అమరవీరుల చిత్రపటాలకు ఘన నివాళులు






**నడికూడ,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవుల చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ 1928 లో ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగ తీర్చుకోవడానికి ఫిరోజ్పూర్ లో బ్రిటిష్ పోలీస్ అధికారి జెపి సాండర్స్ ను హత మార్చినందుగాను 1931 మార్చి 23న భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. మనుషులను చంపగలరు వారి ఆదర్శాలను కాదు అని, దేశ సేవలో జీవితాలనే త్యాగం చేసి భవిష్యత్ తరాల కోసం బంగారు బాటలు వేసిన మహానుభావులని అన్నారు.భారతదేశం తన దాస్య శృంఖలాలను తెంచుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చడానికి తమ ప్రాణాలను దారబోసిన అమరవీరులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు ల త్యాగాలను స్మరించుకుందాం. వారి ఆశయ సాధనలో పునరంకితం అవుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో గృహలక్ష్మి లబ్ధిదారుల వినతి

**ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని కలెక్టర్‌కు వినతిలో పేర్కొన్న లబ్ధిదారులు**

**నడికూడ,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గత ప్రభుత్వంలో బలహీన వర్గాలకు గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇళ్లను ప్రస్తుత ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేసి తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన గృహలక్ష్మి లబ్ధిదారులు సోమవారం గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ను ప్రజావాణిలో కలిసి వేడుకున్నారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు గృహలక్ష్మి ఇండ్లను మంజూరు చేశారని, ఆ భరోసాతో మేము ఇండ్లు నిర్మించుకున్నామని కానీ ఇప్పటివరకు దానికి సంబంధించిన బిల్లులు



తేది.23-03-2026

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్, హనుమకొండ గారికి
నమస్కరించి వ్రాయునది ఏమనగా!

ఆర్యా!

విషయం:– గృహలక్ష్మి లబ్ధిదారులమైన మాకు ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ వర్తింపచేసి ఆర్థికంగా మంజూరి గురించి – విన్నపము.

...........

మేము అనగా (1) లదె జ్యోతి, భర్త: రాములు, (2) చింపన్న బుచ్చమ్మ, భర్త: ఆది రెడ్డి, (3) తిప్పారపు రమాదేవి, భర్త: రాజేశ్వర్ రావు, (4) వాడికారి రమ దేవి, భర్త: రాజన్న, (5) మిత్తుల సారమ్మ, భర్త: మొగిలి, (6) గందం స్వరూప, భర్త: సమ్మయ్య, (7) ర్యాగల్ల మమత, భర్త: మహేష్, (8) దుబాసి తిరుమల, భర్త: సాంబయ్య, (9) చింపన్న వజ్రమ్మ, భర్త: నర్సయ్య, మేము ముస్త్యాలపల్లి గ్రామము, నడికుడ మండలం, హనుమకొండ జిల్లా, మేము దళిత బలహీన, బడుగు వర్గాలకు చెందిన వారము. మా అందరికి గత ప్రభుత్వం వారు గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేసినారు. ఆ భరోసాతో మేము అప్పులు చేసి ఇండ్లు నిర్మించుకున్నాము కాని డబ్బులు మంజూరు కాలేదు, దాని వలన మేము ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి అగుచున్నాము.

కావున దయామయులైన తమరు గృహలక్ష్మి లబ్ధిదారులమైన మాకు ఇందిరమ్మ ఇండ్లు వర్తింపచేసి మాకు ఆర్థికంగా ఆదుకోగలరని ప్రార్థిస్తున్నాము.

కృతజ్ఞతలతో.......

ఇందువెంట జతపరిచినవి
1. ప్రొసిడింగ్ కాపీలు
2. ఆధార్ కార్డులు

ఇట్లు
మీ విధేయులు

GRIEVANCE CELL
HNK/2026/1791 WGUDC/E/2026
Forwarded to PD, Housing
for taking necessary action as per rule.
DISTRICT COLLECTOR, HANUMAKONDA.

మంజూరు కాలేదని దీంతో మేము అందరం ఆర్థికంగా నష్టపోయి మనోవేదన గురవుతున్నామని తెలిపారు. గృహలక్ష్మి లబ్ధిదారులైన తమకు ఇందిరమ్మ ఇండ్ల స్కీం వర్తింపజేసి తమను ఆర్థికంగా ఆదుకోవాలని కలెక్టర్ ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో లదే రాములు, చింపన్న ఆదిరెడ్డి, గంధం శ్రీను, రాగళ్ల మహేష్, బందెల రవీందర్, వాడికారి రాజన్న, దుబాసి శోభన్, తిప్పరపు. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ

**- వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరికొత్త మోడళ్లు, ఆకర్షణీయమైన డిజైన్లతో 'స్పార్క్లా జ్యువల్స్‘: తుంబూరు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నగరంలోని బోనకల్ రోడ్డు శ్రీరాం హిల్స్ లోని ఎస్ఆర్ కాంప్లెక్స్ లో హైదరాబాద్‌కు చెందిన 'స్పార్క్లా జ్యువల్స్‘ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించిన 'స్వర్ణ ఉత్సవం‘ ప్రదర్శన ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీడ్రా విజేతలకు సోమవారం నగదు బహుమతులను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు. **వినియోగదారులకు చేరువగా వినూత్న డిజైన్లు..** ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ జ్యువెలరీ సంస్థ స్పార్క్లా వారు ఖమ్మం నగర వాసుల కోసం ప్రత్యేకంగా ఈ ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినంద నీయమన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరికొత్త మోడళ్లు, ఆకర్షణీయమైన డిజైన్లతో కూడిన ఆభరణాలను అందుబాటులోకి తీసుకువచ్చారని కొనియాడారు. కేవలం వ్యాపారమే కాకుండా, లక్కీడ్రా ద్వారా వినియోగదారులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందించడం సంతోషకరమన్నారు. ఇలాంటి ప్రదర్శనలు స్థానిక ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలను ఎంచుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని ఆయన వివరించారు. **లక్కీడ్రా విజేతలు వీరే...** లక్కీడ్రాలో శ్రీరాం హిల్స్‌కు చెందిన వై. కృష్ణ ప్రసాద్ ప్రథమ బహుమతిగా రూ. 25,111 నగదును అందుకోగా, ఎ. వరలక్ష్మి ద్వితీయ బహుమతిగా రూ. 15,111 నగదును గెలుచుకున్నారు.







# 8వ రోజుకు ఇండ్ల స్థలాల పోరాటం

**- ప్రధాన సమస్యను పట్టించుకోని యూనియన్ నాయకులు**

**- యూనియన్ల కతీతంగా జర్నలిస్టులు పోరాటానికి సిద్ధం కావాలి**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లా మంత్రులు జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన 23.02 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలుగా అప్పగించాలని ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబు రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కొరకొప్పుల రాంబాబు మాట్లాడుతూ... జర్నలిస్టులందరూ తమ కుటుంబ సభ్యులుగా భావించే జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వాలు ఇచ్చిన హామీని అమలు చేసుకునేందుకు ముందుకు రాకపోగా అందరి ఇళ్ల స్థలాల కై పోరాటం చేస్తున్న వారికి మద్దతు తెలపకపోవడం చాలా బాధాకరమన్నారు. పోరాటం చేయండి ఇళ్ల స్థలాలు రావని గత రెండున్నర దశాబ్దాల కాలంగా అర్హులైన జర్నలిస్టులందరికీ తెలిసిన విషయమే. యూనియన్లు ఆయా సంఘాల కార్యక్రమాలకు, సభలు సమావేశాలకు జర్నలిస్టులను వాడుకోవడమే కానీ వారి ప్రధాన సమస్య ఇండ్ల స్థలాల సమస్యను తీర్చేందుకు ముందుకు రావడం లేదని విమర్శించారు. సమాజంలో ప్రతి సమస్య పరిష్కారం కావాలంటే పోరాటం చేయక తప్పడం లేదని, అదే తరహాలో నేడు ఆశా కార్యకర్తల జీతాలను పెంచేందుకు ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేయాలని ఖమ్మం మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడం జర్నలిస్టులకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. నాయకుల మాటలు నమ్మి ఇప్పటికే రెండున్నర దశాబ్దాల కాలం మోసపోయావని ప్రతి జర్నలిస్టు గమనించాలన్నారు. సమాజంలో ప్రజలందరి సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాల అమలు కోసం, జీతభత్యాలు లేకపోయినప్పటికీ, కాల పరిమితి లేకుండా రాత్రింబగళ్లు కష్టపడి జర్నలిస్టులు పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను మోసం చేసే ప్రభుత్వాలు భవిష్యత్తులో మనుగడను కొనసాగించలేవని పేర్కొన్నారు. భార్యా, పిల్లలు, కుటుంబ నేపథ్యాన్ని వదిలి గత ఎనిమిది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ యూనియన్లు, నాయకులు గుర్తించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. మార్చి 31 అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే పోరాటాన్ని రిలే నిరాహారదీక్ష గా కొనసాగిస్తానని, కొన్ని సందర్భాల్లో జర్నలిస్టులు స్వతంత్రంగా ఆలోచించి తమ సమస్యగా పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



# హైకోర్టు ఆదేశాలు స్వాగతార్హం

**- రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఆర్థిక ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి**

**- ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి టి. వేణు**




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాల అంశంపై హైకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలను ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. కోర్టును ఆశ్రయించి సోమవారం కాంటెంప్ట్ ఉత్తర్వులు పొందిన పెన్షనర్లకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను ఈ ఏడాది ఏప్రిల్ 9లోగా చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం సంతోషకరమైన పరిణామమని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి టి. వేణు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను గౌరవప్రదంగా అమలు చేయడమే కాకుండా, కోర్టు ఉత్తర్వులతో సంబంధం ఉన్నవారికే పరిమితం కాకుండా, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన వారందరికీ సమానంగా ఆర్థిక ప్రయోజనాలు చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు తమ సేవాకాలంలో సంపాదించుకున్న హక్కుల రూపమైన ఆర్థిక ప్రయోజనాలు ఆలస్యమవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కోర్టు తీర్పులను అమలు చేయాల్సిన బాధ్యతతో పాటు, ఒకే పరిస్థితిలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులందరికీ సమన్యాయం చేయాల్సిన నైతిక బాధ్యత కూడా ఉందని సంఘం నాయకులు తెలిపారు. కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే ప్రయోజనాలు కల్పించి, మిగతావారిని నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదని వారు అభిప్రాయపడ్డారు. అదే విధంగా, 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉద్యోగులందరికీ ఒకే విధంగా చెల్లింపులు జరిపితే ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరుగుతుందని, అనవసర న్యాయపరమైన వివాదాలు కూడా తగ్గుతాయని చెప్పారు. ప్రభుత్వం ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించకపోతే, మిగిలిన రిటైర్డ్ ఉద్యోగులందరూ న్యాయం కోసం కోర్టు తలుపుతట్టే పరిస్థితి తలెత్తే అవకాశముందని వారు హెచ్చరించారు. అలాంటి పరిస్థితిలో ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడటమే కాకుండా, పరిపాలనా పరంగా కూడా చిక్కులు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల ప్రభుత్వం, సంబంధిత అధికారులు ముందస్తుగా స్పందించి, అందరికీ సమాన న్యాయం జరిగేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం మానవీయ దృష్టితో పరిశీలించి, ఆలస్యం చేయకుండా వారికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని సంఘం డిమాండ్ చేసింది. ఉద్యోగ జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా, వారి న్యాయమైన హక్కులను సమయానికి అందించడం ప్రభుత్వ బాధ్యత అని సంఘం నాయకులు స్పష్టం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌గా

# సహోదర్ రెడ్డి ఘన విజయం

**● రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సహోదర్ రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించిన న్యాయవాదులు, బార్ అసోసియేషన్**









**హనుమకొండ బ్యూరో,మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ పోటీలో ఉమ్మడి వరంగల్ జిల్లా శ్రీనుంచి 11 మంది న్యాయవాదులు బరిలో నిలవగా . ఇందులో సీనియర్ న్యాయవాది ఎం సహోదర రెడ్డి, ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఘన విజయం సాధించారు. సోమవారం హనుమకొండ పది కోర్టు ల భవనం ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమం లో సహోదర్ రెడ్డి ని, న్యాయవాదులు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు గజమాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా సహోదర్ రెడ్డి ఘన విజయం సాధించడం న్యాయవాదుల వర్గంలో ఆనందాన్ని కలిగించింది. న్యాయ వృత్తిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సహోదర రెడ్డి, న్యాయ సేవలను ప్రజలకు చేరవేయడంలో ఎప్పటినుంచో కృషి చేస్తున్నారు. ఆయన సాధించిన ఈ విజయం న్యాయవాదుల ఐక్యతకు, విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.రెడ్డి న్యాయ రంగంలో విశేష అనుభవం కలిగిన వ్యక్తిగా, పేద, అణగారిన వర్గాలకు న్యాయం అందించడంలో ముందుంటూ సేవలు అందిస్తున్నారన్నారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడం, వారి సంక్షేమం కోసం కృషి చేయడం తన ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, ప్రముఖులు సహోదర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో బార్ కౌన్సిల్ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, న్యాయవాదుల హక్కులు పరిరక్షించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సహోదర్ రెడ్డి విజయం భవిష్యత్తులో న్యాయరంగ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అంబరీష్, జిల్లా కోర్టు పిపి పోతరాజు రవి, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రజెంట్ సుధీర్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జయపాల్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, న్యాయవాదులు శ్రీధర్ రెడ్డి, గురుమిళ్ళ రాజు, చంద్ర ప్రకాష్, సీనియర్ ఈసీ మెంబర్ సురేష్, స్పోర్ట్స్ సెక్రటరీ శివప్రసాద్, న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే ప్రథమం..

**- తుమ్మల ఆశీస్సులతో 48వ డివిజన్‌లో శుభ్రతకు శ్రీకారం**

**- 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల భద్రతే ప్రథమం అని, మంత్రి తుమ్మల ఆశీస్సులతో 48వ డివిజన్‌లో శుభ్రతకు శ్రీకారం చుట్టామని 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే నాయకత్వం ఉన్నప్పుడు సమస్యల పరిష్కారం ఎంత వేగంగా జరుగుతుందో ఖమ్మం నగరంలోని 48వ డివిజన్‌లో సోమవారం మరోసారి స్పష్టమైంది. డివిజన్ పరిధిలోని ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం, అడ్డదిడ్డంగా పెరిగిన పిచ్చి మొక్కలు స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయి. ముఖ్యంగా ఆ ప్రాంతంలో పాములు సంచరిస్తున్నాయన్న సమాచారం రావడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఆందోళన చెందారు. రాత్రి వేళలు మాత్రమే కాకుండా పగటి పూట కూడా బయటకు రావడానికి ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను స్థానికులు తమ గోడుగా తెలియజేయగానే, రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో, యువనేత తుమ్మల యుగేందర్ ఆదేశాల మేరకు 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ వెంటనే స్పందించారు. ప్రజల రక్షణకన్నా ముఖ్యమైన పని మరొకటి లేదనే భావంతో మున్సిపల్ అధికారుల కోసం ఎదురుచూడకుండా, స్వయంగా ముందడుగు వేశారు.ప్రజా భద్రతే ప్రథమ కర్తవ్యంగా భావించిన అల్లే సాయికిరణ్, తన సొంత ఖర్చులతో జేసీబీని ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన శుభ్రత పనులు చేపట్టించారు. ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, పాములకు ఆశ్రయం గా మారిన పొదలు, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చించారు. ఈ పనులను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించడం స్థానికుల్లో మరింత విశ్వాసం నింపింది. ఒక నాయకుడు అంటే కేవలం మాటలకే పరిమితం కాకుండా, అవసరమైన సమయంలో చర్యతో ప్రజల ముందుండాలని అల్లే సాయికిరణ్ మరోసారి చాటిచెప్పారని ప్రజలు అభిప్రాయపడ్డారు. సమస్యను చూసి వెళ్లిపోవడం కాదు, సమస్యను పరిష్కరించే వరకు విశ్రాంతి తీసుకోకుండా కృషి చేయడం నిజమైన ప్రజా సేవకుడి లక్షణమని స్థానికులు కొనియాడుతున్నారు. డివిజన్ ప్రజల క్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ, ఎప్పటికప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్న అల్లే సాయికిరణ్ సేవలను ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. స్థానికులు మాట్లాడుతూ... తమ భయాన్ని అర్థం చేసుకుని వెంటనే స్పందించిన అల్లే సాయికిరణ్‌కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చిన్న సమస్యగా భావించకుండా, ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశంగా గుర్తించి తనవంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు అండగా నిలిచి, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండే నాయకత్వం ఇలానే ఉండాలని అన్నారు. ప్రజా సేవను ఓ బాధ్యతగా కాకుండా, ఓ ధర్మంగా స్వీకరించి పనిచేస్తున్న అల్లే సాయికిరణ్ అండ్ టీమ్ మున్ముందు కూడా డివిజన్‌లోని మరిన్ని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని స్థానికులు ఆకాంక్షించారు. తుమ్మల నాగేశ్వర రావు ఆశీస్సులు, తుమ్మల యుగేందర్ మార్గ దర్శకత్వంతో 48వ డివిజన్ అభివృద్ధి, ప్రజా భద్రత, పరిశుభ్రతలో ఆదర్శంగా నిలవాలని వారు అభిలషించారు.




# పద్మావతి నగర్‌లో వెలుగుల పండుగ

**● చీకట్లకు చెక్... ● ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం**

**● కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్**



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చీకట్లకు చెక్ పెడుతూ పద్మావతి నగర్‌లో వెలుగుల పండుగ గా నిలిచిందని 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ అన్నారు.ఈ సందర్భంగా అల్లే సాయికిరణ్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలకు మరో మంచి ఉదాహరణగా ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ పద్మావతి నగర్ రెండో లైన్‌లో నెలకొన్న చీకటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో, వారి తనయులు తుమ్మల యుగేందర్ ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో సోమవారం నూతనంగా మూడు వీధిలైట్ల స్తంభాలను ఏర్పాటు చేయడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని నింపిందన్నారు. చాలా కాలంగా రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు వీధిలైట్లు లేక చీకటిలోనే సంచరించాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాత్రివేళ బయటకు రావడానికే భయపడే పరిస్థితులు ఉండేవని స్థానికులు తెలిపారు. అలాంటి సమస్యను ప్రజల విజ్ఞప్తి మేరకు తక్షణమే పరిగణనలోకి తీసుకుని, ఆలస్యం చేయకుండా పరిష్కరించడం పట్ల డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షిస్తూ, వేగంగా పూర్తి చేయించడంలో 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ చొరవ ప్రదర్శించారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో తన కట్టుబాటును మరోసారి చాటుకున్నారని స్థానికులు అభినందిస్తున్నారు. చీకటి కమ్ముకున్న వీధుల్లో ఇప్పుడు వెలుగులు నిండడంతో ఆ ప్రాంతం కొత్త ఊపును సంతరించుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ మాట్లాడుతూ... అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. 48వ డివిజన్‌లో ఏ సమస్య వచ్చినా ప్రజల పక్షాన నిలబడి, తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. పద్మావతి నగర్‌లో వీధిలైట్ల ఏర్పాటు కేవలం ఒక పనిగా కాకుండా, ప్రజల భద్రత, సౌకర్యం, నమ్మకానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. మున్ముందు కూడా డివిజన్ వ్యాప్తంగా ఉన్న మరిన్ని సమస్యలను గుర్తించి, ఒక్కొక్కటిగా పరిష్కరించి, 48వ డివిజన్‌ను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ప్రజా సేవలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని అల్లే సాయికిరణ్ పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ అభివృద్ధి కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను వారి సమస్యగానే భావించి వెంటనే స్పందించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చీకటి తొలగి వెలుగులు నిండిన పద్మావతి నగర్ ఇప్పుడు ప్రజా సేవకు, స్పందనకు, అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# జర్నలిజం పేరుతో దందాలు ఇక సహించం



**నకిలీ జర్నలిస్టుల భరతం పడతాం**

**జర్నలిస్టుల సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్ రెడ్డి, ఖాజాపాషా కేపి**

**షాద్ నగర్, మార్చి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిజం అనే పవిత్ర వృత్తిని కొందరు నకిలీ వ్యక్తులు బ్లాక్మెయిల్ దందాలకు వేదికగా మార్చుతున్నారని, ఇకపై అలాంటి చర్యలను సహించబోమని , సీనియర్ జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్ రెడ్డి, ఎండి ఖాజాపాషా (కెపి) హెచ్చరించారు. షాద్నగర్ పట్టణ కేంద్రంలోని దేవి గ్రాండ్ లో సోమవారం టీ డబ్ల్యూ జేఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జే రాఘవేందర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో అధ్యక్షతన కొనసాగింది. లట్టుపల్లి మోహన్ రెడ్డి మాట్లాడుతూ...నకిలీ జర్నలిస్టుల చర్యల వల్ల అసలైన జర్నలిస్టుల ప్రతిష్ట దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజం అనేది సేవా వృత్తిగా భావించి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. జర్నలిజాన్ని పార్ట్‌టైమ్‌గా స్వీకరించి, ఇతర వృత్తులతో జీవనం సాగించవచ్చని అన్నారు. సరైన శిక్షణతో జర్నలిజం ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు.కేపీ మాట్లాడుతూడ జర్నలిస్టుల పేరుతో దాడులు చేయడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టులు సంఘటన స్థలాలకు వెళ్లి సమాచారం సేకరించి వార్తలు అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని,దాడులకు పాల్పడే వారిని జర్నలిస్టులుగా పరిగణించలేమన్నారు. నకిలీ జర్నలిస్టుల కారణంగా ప్రజల్లో అపోహలు పెరుగుతున్నాయని,అసలైన రిపోర్టర్లపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.ఫరూక్‌నగర్ మండలం విఠ్యాల గ్రామంలో జర్నలిస్టుల పేరుతో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూడఇలాంటి చర్యలను అరికట్టేందుకు ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. అవసరమైతే పోలీసులకు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూడ అసలైన జర్నలిస్టులను గుర్తించే విధంగా జాబితా రూపొందించి అధికారులకు అందించాలని సూచించారు.ఇతర ప్రాంతాల నుంచి వచ్చి బ్లాక్మెయిల్ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టులకు ప్రెస్ కార్డులు జారీ చేసి న్యాయం చేయాలని అభిప్రాయపడ్డారు.జర్నలిస్టుల ఐక్యతతోనే ఇలాంటి సమస్యలకు పరిష్కారం సాధ్యమని, ఏప్రిల్ మొదటి లేదా రెండో వారంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి నరేష్,జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహా రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్, టి. సంజీవ్ కుమార్, సరాపు రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు రాకే ష్ , ఖాజా సోహెల్, చందర్ రాజు, భాస్కర్, నరేందర్, సురేందర్, ధరం పాల్, షకీల్, ఆనంద్, అజీమ్, శేఖర్, రాజు, రియాజ్, అశోక, ఆవుల రమేష్,దిర్శనంశంకర్,వానరసి జగన్, మురళీ పాల్గొన్నారు.



# 20 మంది కోర్ టీమ్‌తో టీమిండియా సిద్ధం

క్రికెట్ ప్రపంచంలో అతిపెద్ద సమరం వన్డే వరల్డ్ కప్ 2027కు ఇంకా సమయం ఉన్నప్పటికీ, టీమిండియా సెలెక్టర్లు అప్పుడే తమ మాస్టర్ ప్లాన్‌ను రెడీ చేసేశారు. ఒకవైపు ఆటగాళ్లందరూ ఐపీఎల్ 2026 హడావుడిలో ఉంటే, మరోవైపు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ మాత్రం మిషన్ 2027 కోసం 20 మంది కోర్ టీమ్ (ప్రధాన ఆటగాళ్లు)ను దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న ఈ మెగా టోర్నీ కోసం సెలెక్టర్లు వేస్తున్న వ్యూహాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. సౌతాఫ్రికా, జింబాబ్వేలోని పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు స్వర్గధామం. బంతి బాగా బౌన్స్ అవ్వడమే కాకుండా వేగానికి సహకరిస్తాయి. అందుకే సెలెక్టర్లు ఆరుగురు స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్లను తమ 20 మంది జాబితాలో చేర్చారు. జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలతో పాటు యంగ్ సెన్సేషన్ హర్షిత్ రాణా కూడా ఈ రేసులో ఉన్నారు. అయితే, గత వరల్డ్ కప్‌లో వికెట్ల వేట సాగించిన మొహమ్మద్ షమీ పేరు ఈ లిస్టులో లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఫిట్‌నెస్, వయస్సు రీత్యా షమీని పక్కన పెట్టి యువతరం వైపు మొగ్గు చూపాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. చాలా కాలంగా అభిమానుల మనసులో మెదులుతున్న ప్రశ్న.. 2027 వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉంటారా అని. తాజా సమాచారం ప్రకారం, సెలెక్టర్లు సిద్ధం చేసిన 20 మంది జాబితాలో ఈ ఇద్దరు దిగ్గజాల పేర్లు కూడా ఉన్నాయి. జట్టుకు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, రోహిత్, కోహ్లీ అనుభవం జట్టుకు అవసరమని సెలెక్టర్లు భావిస్తున్నారు. యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, ఇషాన్ కిషన్ వంటి యువ ఆటగాళ్లకు వీరిద్దరి మార్గదర్శకత్వం తోడైతే కప్పు గెలవడం సులువని బోర్డు యోచిస్తోంది. తాము అనుకున్న 20 మంది ఆటగాళ్ల ఫిట్‌నెస్, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్, ప్రస్తుత ఫామ్‌ను నిశితంగా గమని స్తారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత ఈ 20 మంది నుం చి తుది 15 మందిని వరల్డ్ కప్ స్క్వాడ్ కోసం ఎంపిక చేయనున్నారు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.



# ఐపీఎల్ కోసం వెళ్తే కఠిన చర్యలు: విదేశీ ఆటగాళ్లకు పీసీబీ ఛైర్మన్ వార్నింగ్



చివరి నిమిషంలో పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) నుంచి తప్పుకునే విదేశీ ఆటగాళ్లను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ హెచ్చరించాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం పీఎస్ఎల్ నుంచి తప్పుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాడు. వరుసగా రెండో ఏడాది కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్‌-ఎల్), ఐపీఎల్‌లు ఒకే సమయంలో జరగనున్నాయి. దాంతో చాలా మంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్‌ను వదిలేసి ఐపీఎల్ ఆడేందుకు మొగ్గు చూపుతున్నారు. జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరాబాని, శ్రీలంక స్టార్ ఆల్‌రౌండర్ దసన్ షనక, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ పీఎస్ఎల్‌ను వీడి ఐపీఎల్ ఆడేందుకు సిద్ధమయ్యారు. చివరి నిమిషంలో ఈ ఆటగాళ్లు పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీలతో తమ ఒప్పందాలను రద్దు చేసుకున్నారు. ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టుతో బ్లెస్సింగ్ ముజారాబానీ, లాహోర్ ఖలందర్స్ జట్టుతో దసన్ షనక తమ కాంట్రాక్టులను వదులుకున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన మోహ్‌సిన్ నఖ్వీ విదేశీ ఆటగాళ్లపై విమర్శలు గుప్పించాడు. 'మేం రూల్స్ ప్రకారం ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటాం. గతేడాది పెషావర్ జల్మీకి ఆడిన కార్బిన్ బోష్.. ఆఖరి నిమిషంలో జట్టును వీడి ముంబై ఇండియన్స్‌లో చేరాడు. దాంతో పీఎస్ఎల్ ఆడకుండా అతనిపై ఏడాది పాటు నిషేధం విధించారు. ఈ సారి కూడా అదే విధమైన కఠిన చర్యలు తీసుకుంటాం.

# ప్రాక్టీస్ మ్యాచ్‌లో దుమ్మురేపిన కోహ్లీ

ఐపీఎల్ 2026 సీజన్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సిద్ధమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సన్నదమవుతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ప్రాక్టీస్ క్యాంప్‌లో ముమ్మరంగా సాధన చేస్తోంది. మరో 5 రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్ తెరలేవనుండటంతో అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోంటుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. జట్టులోని ఆటగాళ్లంతా రెండు జట్లుగా విడిపోయారు. ఒక జట్టుకు కృనాల్ పాండ్యా సారథ్యం వహించగా.. మరో జట్టును వెకంటేష్ అయ్యర్ నడిపించాడు. ఈ సన్నాహక మ్యాచ్‌లో జితేశ్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. 37 బంతుల్లోనే 81 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గత సీజన్ తరహాలోనే ఈ సీజన్‌లోనూ ఆర్‌సీబీ ఫినిషర్‌గా సత్తా చాటేందుకు రెడీ అయ్యాడు. అతని తర్వాత ఆస్ట్రేలియా ఆటగాడు టీమ్ డేవిడ్ 14 బంతుల్లో 36 పరుగులు చేశాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేష్ అయ్యర్ 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు.ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 12 బంతుల్లో 3 సిక్స్‌లతో 29 పరుగులు చేశాడు. తక్కువ పరుగులే చేసినా.. దూకుడుగా ఆడాడు. వెంకటేశ్ అయ్యర్‌ను మిడిలార్డర్‌లో ఆడించాలనే యోచనలో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు సంబంధించిన ఒక వీడియోను ఆర్‌సీబీ ఫ్రాంచైజీ సోమవారం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ వీడియోలో కృనాల్ పాండ్యా మాట్లాడుతూ.. 'ఇది ఒక గొప్ప



ప్రాక్టీస్ మ్యాచ్. భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, మంగేష్ యాదవ్ బౌలింగ్‌లో బాగా రాణించాడు. జితేష్ శర్మ, టీమ్ డేవిడ్, వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు'అని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ తమ తొలి టైటిల్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ జోరును తాజా సీజన్‌లోనూ కొనసాగించి టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆర్‌సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. గౌహతిలో రాజస్థాన్ రాయల్స్, ముంబైలో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.

# ఐసీసీ అవార్డుల్లో భారత్, పాక్ జోరు..

**• ఫర్హాన్, అరుంధతి రెడ్డిలదే హవా**

అంతర్జాతీయ క్రికెట్ మండలి ఫిబ్రవరి 2026 నెలకు సంబంధించి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రకటించింది. ఈసారి భారత్, పాకిస్థాన్ ఆటగాళ్లు చెరో అవార్డును దక్కించుకోవడం విశేషం. పురుషుల విభాగంలో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్, మహిళల విభాగంలో భారత పేసర్ అరుంధతి రెడ్డి ఈ ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా ఇటీవలే ముగిసిన టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసినందుకు ఫర్హాన్ కు ఈ గౌరవం దక్కింది. పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ టీ20 వరల్డ్ కప్ 2026లో మునుపెన్నడూ లేని విధంగా చెలరేగిపోయాడు. పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశలోనే నిష్క్రమించినప్పటికీ, ఫర్హాన్ వ్యక్తిగత ప్రదర్శన మాత్రం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. కేవలం 6 ఇన్నింగ్స్‌ల్లోనే 76.6 సగటుతో 383 పరుగులు రాబట్టాడు. ఇందులో రెండు అద్భుతమైన సెంచరీలు ఉండటం గమనార్హం. 160కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన అతడు, టోర్నీలో ఏకంగా 18 సిక్సర్లు, 37 ఫోర్లతో స్టేడియాలను హోరెత్తించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతడిని ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నిలబెట్టింది. మహిళల క్రికెట్‌లో భారత పేసర్ అరుంధతి రెడ్డి ఫిబ్రవరి నెలలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన టీ20 సిరీస్‌లో అరుంధతి తన స్వింగ్ బౌలింగ్‌తో కంగారూ బ్యాటర్లను కట్టడి చేసింది. మూడు మ్యాచ్‌ల్లోనే ఏకంగా 8 వికెట్లు పడగొట్టి సిరీస్ విజయానికి కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో కేవలం 22 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి కెరీర్ బెస్ట్ ప్రదర్శన ఇచ్చింది. కాన్బెర్రా, అడిలైడ్ మ్యాచ్‌ల్లో కూడా చెరో రెండు వికెట్లు తీసి తన సత్తా చాటింది. అందుకే ఐసీసీ ఆమెను ఫిబ్రవరి నెలకు గాను ఉత్తమ మహిళా క్రికెటర్‌గా ఎంపిక చేసింది. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుల చరిత్రను చూస్తే టీమిండియా ఆటగాళ్లదే పైచేయిగా ఉంది. యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఇప్పటివరకు అత్యధికంగా నాలుగు సార్లు (జనవరి 2023, సెప్టెంబర్ 2023, ఫిబ్రవరి 2025, జూలై 2025) ఈ అవార్డును గెలుచుకుని రికార్డు సృష్టించాడు. జస్ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్ కూడా రెండేసి సార్లు ఈ ఘనత సాధించారు. ఇక పాకిస్థాన్ నుంచి బాబర్ ఆజం మూడు సార్లు ఈ అవార్డు దక్కించుకోగా, ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్, లంక ప్లేయర్ కామిందు మెండిస్ రెండేసి సార్లు విజేతలుగా నిలిచారు. తాజాగా అరుంధతి రెడ్డి ఈ జాబితాలో చేరడం భారత మహిళల క్రికెట్‌కు శుభపరిణామం.



# హనుమాన్ చాలీసానే వింటాను

**ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య**

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య క్రీడా వర్గాల్లో ఎప్పుడూ హాట్‌టాపిక్‌గా నిలుస్తుంటాడు. రీసెంట్‌గా అత్యంత ఖరీదైన ఫెరారీ 12 సిలిండ్రి కారును కొనుగోలు చేశాడు. దీని ఖరీదు రూ.8 కోట్లకు పైమాటే. ఈ లగ్జరీ కారులో పాండ్య రీసెంట్‌గా తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి చక్కర్లు కొట్టిన వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో అతడి లగ్జరీ లైఫ్ గురించి మరోసారి నెట్టింట చర్చ మొదలైంది. ఈ క్రమంలో హార్దిక్ తాజాగా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం హార్దిక్ ఐపీఎల్ ప్రిపరేషన్స్‌లో బిజీగా ఉన్నాడు. తాజాగా జట్టు బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్‌తో ముంబయిలో ఓ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఇందులో అతడు మాట్లాడుతూ, హనుమాన్ చాలీసా ఇచ్చినంత పాజిటివ్ ఎనర్జీ ఏ పాట కూడా ఇవ్వలేదని పేర్కొన్నాడు. తాను ఫెరారీ కారులో వెళ్తున్నప్పటికీ జర్నీ చేసేటప్పుడు 'హనుమాన్ చాలీసా'నే వింటానని తెలిపాడు. 'నాకు ఫెరారీ కారు ఉంది. అది ఎంత లగ్జరీ అయినప్పటికీ అందులో వెళ్తుంటే నేను హనుమాన్ చాలీసానే వింటాను. ఏ పాట కూడా



హనుమాన్ చాలీసా ఇచ్చినంత పాజిటివ్ ఎనర్జీ ఇవ్వలేదు. దీనిని అందరూ అంగీకరించాల్సిందే!' అని హార్దిక్ చెప్పాడు.అయితే అత్యంత ఖరీదైన వాచీలు ధరించడం నుంచి లగ్జరీ కార్లలో తిరగడం దాకా హార్దిక్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటాడు. ఇటీవల భారత్ టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన సందర్భంలో మైదానంలో తన గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మతో హార్దిక్ చేసుకున్న సంబరాలు కాంట్రవర్సీ అయ్యాయి. మరో 5 రోజుల్లో లీగ్ ప్రారంభం ఉండగా, ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పాండ్య తనకు తానుగా కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని అన్నాడు. అలాగే ఇటీవల భారత్‌కు వరల్డ్‌కప్ సాధించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు మేనేజ్‌మెంట్ జట్టు పగ్గాలు అప్పగించాలని తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషిస్తూ పేర్కొన్నాడు.

# న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన సౌతాఫ్రికా..

**• ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం**



వెల్లింగ్టన్ వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 19 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఆఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 164 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 145 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా బ్యాటర్ కానర్ ఎస్టర్‌హ్యూజెన్ 36 బంతుల్లో 57 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కివీస్ ఓపెనర్ టిమ్ రాబిన్సన్ 32 పరుగులతో శుభారంభం ఇచ్చినప్పటికీ, మిడిల్ ఆర్డర్ విఫలం కావడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ విజయంతో సౌతాఫ్రికా ఆటగాళ్లలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా స్పిన్నర్లు కేశవ్ మహారాజ్, ప్రినిలన్ సుబ్రాయన్ అద్భుతంగా బౌలింగ్ చేసి న్యూజిలాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. అరంగేట్రం చేసిన సుబ్రాయన్ 13 పరుగులకే 2 వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. అలాగే కెప్టెన్ కేశవ్ మహారాజ్ 22 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి తన అనుభవాన్ని చాటుకున్నాడు.

# మే1న రిలీజ్ కానున్న గాయపడ్డ సింహం

టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం మూవీ కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. ట్రైజర్ సైటైరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసు కునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని ట్రైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్టేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి.

ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుద తేదీపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ మూవీ మే 1న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రాంచరణ్ నటిస్తోన్న పెద్ది రిలీజైన మరుసటి రోజే అన్నమాట. దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో పంపిణీ చేస్తున్నారు. ఈ మూవీలో విష్ణ ఓయ్, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సప్తస్వ మీడియా వర్క్స్, ఖక్షు స్టోరీస్, జీస్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ్ చక్రవర్తి మంథిన, భాను కిరణ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేశ్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.





# పవన్ డబుల్ ధమాకా..

## ఒకవైపు పొలిటికల్ థ్రిల్లర్.. మరోవైపు కమర్షియల్ ఎంటర్‌టైనర్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో విజయాన్ని అందుకుని మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ మాస్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తుండటంతో పవన్ తన తదుపరి చిత్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఆయన 33వ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో జోరుగా చక్కర్లు కొడుతోంది. విభిన్నమైన చిత్రాల దర్శకుడు దేవా కట్టాతో పవన్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది.'ప్రస్థానం', 'ఆటో నగర్ సూర్య', 'రిపబ్లిక్' వంటి సీరియస్, వాస్తవిక కథాంశాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న దేవా కట్టా, ఈసారి పవన్ కోసం ఒక పవర్‌ఫుల్ పొలిటికల్ థ్రిల్లర్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ రాజకీయ సిద్ధాంతాలు, ఆయన ఆలోచనా విధానానికి అద్దం పట్టేలా ఈ సినిమా ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇప్పటికే కథ లాక్ అవ్వగా, ప్రాథమిక చర్చలు కూడా పూర్తయ్యాయని అంటున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాలు తీయడంలో దిట్ట అయిన దేవా కట్టా దర్శకత్వంలో పవన్ నటించనున్నారనే వార్త అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.


ఇదిలా ఉంటే... పవన్ కల్యాణ్ మరోవైపు స్టైలిష్ దర్శకుడు సురేందర్ రెడ్డితో ఓ భారీ ప్రాజెక్ట్‌కు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదొక పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఈ సినిమా కూడా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# రౌడీ జనార్ధన్ మూవీ కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.




# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు




టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.




# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

**ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి**

**గాయని మంగ్లీ ప్రకటన విడుదల**

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా

## 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రారడ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే దయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు.ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.